

జగన్ బొమ్మల బెడద



- ప్రచారం పిచ్చితో భూ సర్వే రాళ్లపై తన బొమ్మ ముద్రించుకున్న ఆనాటి సీఎం
- ఉమ్మడి జిల్లాలో నాలుగున్నర లక్షల సర్వే రాళ్లు
- ఒక్కోరాయి పాతడానికి రూ.150 చొప్పున తగలేసిన వైసీపీ ప్రభుత్వం
- జగన్ బొమ్మలు తొలగించేందుకు రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వం

గత సీఎం జగన్ రెడ్డి బొమ్మల పిచ్చి రైతులకు అష్టకష్టాలు తెచ్చి పెట్టింది. రూ. కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిన ఈ విధానం మీద రైతులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సర్వే అవకతవకలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న భూరక్ష-భూహక్కు పేరుతో పొలాలను సర్వే చేసే కార్యక్రమాన్ని (ల్యాండ్ టైటిలింగ్ యాక్టు) 2022లో నాటి సీఎం జగన్ రెడ్డి ఎంతో ఘనంగా ప్రారంభించారు. పొలాలను కొలతలు వేసి తన బొమ్మతో రాళ్లు పాతడమే కాకుండా గతంలో ఉన్న పాసు పుస్తకాలను కూడా మార్చేసి తన బొమ్మతో భూహక్కు పత్రాలను రైతు చేతిలో పెట్టారు. ఈ జగనన్న భూసర్వే-భూరక్ష పథకానికి రాష్ట్రంలో దాదాపు రూ.700 కోట్లు ఖర్చుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు రూ.10 కోట్ల దాకా ఖర్చు చేశారు. ఈ సర్వే రాళ్లపై ముద్రించిన జగన్ బొమ్మను తొలగించే కార్యక్రమాన్ని ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టింది.



సర్వే రాళ్ల కోసం రూ.6 కోట్లు ఖర్చు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 914 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 476 గ్రామాలకు గాను 255 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీటి కోసం 2.50 లక్షల సర్వే రాళ్లను ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి తెప్పించారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 438 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ఆనాటి జగన్ ప్రభుత్వం 211 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 147 గ్రామాల్లో 1.89 లక్షల సర్వే రాళ్లను పొలాల సరిహద్దులో నాటినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తం రెండు జిల్లాల్లో కలిపి 4లక్షలకు పైగానే సర్వే రాళ్లను నాటినట్లు సర్వే, ల్యాండ్ రికార్డ్స్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూరక్ష, భూహక్కు పథకం ద్వారా చేపట్టిన పొలాల రీసర్వే కార్యక్రమంలో తమ పొలాల సర్వే సక్రమంగా జరగలేదని, మళ్లీ కొలతలు వేసి తమ భూముల విస్తీర్ణాన్ని సరిదిద్దాలని రెవెన్యూ కార్యాలయాల వద్ద జిల్లా కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో వందలాది మంది రైతులు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఈ పొరపాట్లను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల నుంచి వినతి పత్రాలను తీసుకుంది. డిసెంబరు చివరికల్లా ఈ తప్పులను సరిదిద్దాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రధానంగా ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రభుత్వం సర్వే రాళ్లను ఏర్పాటు చేయడానికి దాదాపు రూ.500 కోట్ల దాకా ఖర్చు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కోరాయిని తయారు చేసి పొలాల్లో పాతేందుకు రూ.150 ప్రకారం 4 లక్షల సర్వే రాళ్లకు దాదాపు రూ.6 కోట్ల దాకా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. బ్రిటీష్ కాలంలో 1923లో పొలాల సర్వే జరిగిందని, అప్పటి నుంచి మళ్లీ సర్వే జరగకపోవడం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్తూ ఆనాటి సీఎం జగనన్న భూరక్ష-భూహక్కు కార్యక్రమాన్ని 2022లో 390 జీవో ద్వారా ప్రవేశ పెట్టారు. దీని వల్ల రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త కష్టాలు మొదలయ్యాయి. పక్క రైతులతో, బంధువులతో, స్నేహితులతో నిత్యం ఘర్షణలు మొదలయ్యాయి. ఈ గొడవలు పోలీస్ స్టేషన్ల దాకా వెళ్లాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూసర్వేతో పాటు సర్వేరాళ్లు, పాసు పుస్తకాల కోసం ఆనాటి ప్రభుత్వం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 22 లక్షల పాసుపుస్తకాలు, 77 లక్షల సర్వే రాళ్ల తయారు చేయించింది.

మిగతా 6లో..

రాజ్యాంగాన్ని గౌరవించాలి

మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా మంగళవారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి ఫరూక్ పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడటంలో భారత రాజ్యాంగం కీలకపాత్ర వహిస్తుందన్నారు. రాజ్యాంగంలోని మార్గదర్శకాల మేరకు ప్రతిఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు ఖలీల్, రామచంద్రుడు, తిమ్మయ్య, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణలో రాజ్యాంగం పాత్ర కీలకం

నంద్యాల జేసీ విష్ణుచరణ్

7



శివ..శివ..శంకర...



శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని క్షేత్రానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం తెనాలి, హైదరాబాద్‌కు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతికీర్తన, కాలభైరవాష్టకం, శ్రీశైల శివమయం, ఓంకారనాదం, శంకరా శశిధర, శ్రీచక్రరాజ సింహాసనే తదితర శైవ గీతాలకు కళాకారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

- శ్రీశైలం.

నీటి కోసం గళమెత్తారు..!

- రబీలో తాగునీటి సమస్య రాకూడదు
- వాడీవేడిగా ఐఏబీ సమావేశం
- సాగు, తాగునీటి కోసం ఎమ్మెల్యేల పట్టు
- ఎల్లెల్సీ, హంద్రీనీవా విస్తరణతో మరో 10 టీఎంసీలకు కార్యాచరణ
- కీలక అంశాలపై తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ అసెంబ్లీలో గళమెత్తిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తాగునీటి కోసం పట్టుపట్టారు. రబీలో సాగు, తాగునీటి కోసం రైతుల పక్షాన నిలిచి ముక్తకంఠంతో ఐఏబీ సమావేశంలో తమ వాణి వినిపించారు. మంగళవారం కర్నూలు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రబీ సీజన్‌లో నీటి విడుదలకు సంబంధించిన ఐఏబీ సమావేశం మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో జరిగింది. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు ప్రజల నుంచి వినిపించకూడదని, ఇప్పటి నుంచే తగిన కార్యచరణతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా వీలైనంత ఆయకట్టుకు ప్రస్తుత రబీలో హంద్రీనీవా, ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నుంచి నీటిని అందించాలని పంట చివరి దశలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కీలకమైన కృష్ణా ట్రిబ్యునల్ బోర్డుతో పాటు హంద్రీనీవా నుంచి ప్రస్తుత కేటాయింపునకు అదనంగా మరో 10 టీఎంసీల నీటిని కేటాయించాలని ఇతర ముఖ్యమైన అంశాలపై ఐఏబీ సమావేశంలో సభ్యులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు.

మిగతా 7లో..

కలవరింత!



- ధాన్యం ధర పతనం
- తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
- కల్లాల్లోనే వరి ధాన్యం
- పెట్టుబడి కూడా చేతికి రాలేదంటున్న రైతులు
- జాడలేని కొనుగోలు కేంద్రాలు



చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం ధరలు పడిపోయాయి. గిట్టుబాటు ధర లేదని రైతన్న విలవిలలాడుతున్నాడు. పెట్టుబడి కూడా చేతికి రాదని, ప్రభుత్వం తమను ఆదుకోదా? అని ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో వివిధ గ్రామాల్లో వరి కోతలు ముమ్మరం చేశారు. వరి దిగుబడి బాగా వచ్చినా.. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. మండలంలో 1,107 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఎకరాకు వరి నారు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీల ఖర్చులు మొత్తం కలిపి పెట్టుబడులు ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలు వరకు ఖర్చు పెట్టారు. కౌలు రైతులకు మరింత ఖర్చు వచ్చింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఎకరాకు 40 నుంచి 45 బస్తాలు వరి ధాన్యం పండింది. మంచి దిగుబడి వచ్చిందని రైతులు సంతోషపడుతున్నా కనీస మద్దతు ధర లేక పోవడంతో ఆశలు అడియాశలయ్యాయి. గత ఏడాది కర్నూలు సోనా బస్తా రూ.2 వేలు నుంచి రూ.2,500 వరకు, నంద్యాల సోనా రూ.2,500 నుంచి రూ.2,700 వరకు ధర పలికింది. ఈ ఏడాది నంద్యాల సోనా రూ.1,400 నుంచి రూ.1,500, కర్నూలు సోనా రూ.1,100 నుంచి రూ.1,500 లోపు దళారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరలను చూసి రైతులు పెట్టుబడులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కనీస మద్దతు ధర కల్పించాలి:

ఆరుగాలం కష్టించి పండించిన పంటకు కనీస మద్దతు ధర లేక పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. మూడెకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేలు దాక పెట్టుబడి పెట్టా. మార్కెట్‌లో రూ.1,300 విక్రయిస్తున్నారు. వరి ధాన్యం మాత్రం తక్కువ ధరకు కొంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలి.

-యాగంటినాయక్, రైతు, ఎం తాండ

దళారుల దోపిడీ నుంచి వరి రైతులను కాపాడాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. మూడెకరాల్లో వరి సాగు చేశా. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టా. మార్కెట్‌లో ధరలు బాగా తగ్గిపోయాయి. 75 కేజీల బస్తా రూ.1,300 ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. ధర పతనం కావడంతో నష్టపోతున్నాం. దళారుల దోపిడి నుంచి రైతులను కాపాడాలి.

- రవినాయక్, రైతు, ఎం.తాండ

మద్దతు ధరకు పత్తి కొనుగోలు

- మరో రెండు పరిశ్రమల్లో సీసీఐ కొనుగోలు
- డిసెంబరు 2నుంచి నిబంధనలు సడలింపు
- సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి


పరిశ్రమల యజమానులతో సీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దతు ధరకే పత్తి కొనుగోలు చేస్తామని ఏపీసీసీఐ జనరల్ మేనేజర్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మార్కెట్ యార్డు పరిధిలోని పరిశ్రమల్లో సీసీఐ కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి చాంబర్‌లో సీసీఐ లీజు తీసుకున్న పత్తి పరిశ్రమల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని ఎప్పటికప్పుడు జిన్నింగ్ చేసి దూది బేళ్లుగా మార్చి నిల్వ ఉంచాలన్నారు. నిబంధనల ప్రకారం పత్తిని జిన్నింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే ఎన్‌డీబీఎల్ పరిశ్రమ, నాగేంద్ర, జిన్నింగ్ పరిశ్రమ, దారా శ్రీ జిన్నింగ్ పరిశ్రమలో కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని మరో రెండు జిన్నింగ్ పరిశ్రమలు జయంత్ కాటన్స్, ఐశ్వర్య జిన్నింగ్ పరిశ్రమల్లో పత్తి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 17వేల క్వింటాళ్ల పత్తి రైతుల నుంచి కనీస మద్దతు ధర రూ.7,521తో కొనుగోలు చేశామన్నారు. వారం రోజులోపు రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డిసెంబరు 2నుంచి నిబంధనలు సడలించి ప్రతి రైతు నుంచి మొత్తం పత్తిని కొనుగోలు చేస్తామన్నారు. సమావేశంలో జిన్నింగ్ పరిశ్రమ యజమానులు వెంకటరామ్ రెడ్డి, బత్తిన కుబేర్నాథ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



పోస్టాఫీసుకు పోటెత్తారు..!

- రూ.1500 జమ చేస్తారంటూ వదంతులు
- ఉదయం 5 గంటలకే మహిళల క్యూ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పోస్టాఫీసులన్నీ వేలాదిగా తరలివస్తున్న మహిళలతో కిటకిటలాడుతున్నాయి. 18 ఏళ్ల పైబడిన మహిళల వ్యక్తిగత ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1500 జమ చేస్తుందన్న వదంతులు రావడంతో మహిళలు పోస్టాఫీసులకు పరుగులు తీశారు. మంగళవారం నగరంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద తెల్లవారుజాము నుంచి మహిళలు క్యూలో బారులుదీరారు. చలిని సైతం లెక్కచేయకుండా ఆధార్ కార్డుతో నిలబడ్డారు. దీంతో ఆయా పోస్టాఫీసులు జాతరను తలపిస్తున్నాయి. మహిళలు భారీగా తరలివస్తుండటంతో వారిని అదుపు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. వచ్చిన వారందరికీ పోస్టాఫీసులో అకౌంట్‌ను ఓపెన్ చేయిస్తున్నారు. పోస్టాఫీసు ఖాతాల్లో రూ.1500 వేస్తారని పోస్టాఫీసుకు వచ్చామని, వేయరని తెలిస్తే ఎందుకు వస్తామంటూ ఓ మహిళ తెలపడం గమనార్హం.





పులిస్వారీ నాటకంలోని ఒక దృశ్యం

కళ

- రాష్ట్రంలోనే 38 నంది అవార్డులు సొంతం
- నాటక రంగంలో ఆయన ప్రస్థానం అప్రతిహతం
- టీజీవీ కళాక్షేత్రం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు
- కళకు జీవం పోస్తున్న పత్తి ఓబులయ్య

పౌరాణికం ఆయనకు ప్రాణం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 26:

- రాయలసీమలోని అలనాటి ఫ్యాక్షన్ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ఆయన దర్శకత్వంలో ప్రదర్శించిన 'పులిస్వారీ' నాటకం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా 150 సార్లకు ప్రదర్శితమై ప్రశంసలు అందుకుంది. అంతేకాదు, సీమ ముఠా కక్షల నిర్మూలనకు ఎంతో దోహదం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే నంది నాటక పోటీల్లో రెండు బహుమతులు కైవశం చేసుకుంది.
- దేశ తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా రూపొందించిన 'సై...సైరా నరసింహారెడ్డి' నాటకానికి ఆయన దర్శకత్వం వహించారు. ఈ నాటకం రాయలసీమలో ప్రఖ్యాతి పొందింది. విమర్శకుల చేత ప్రశంసలు అందుకుంది. వందకు పైగా ప్రదర్శనలతో గుర్తింపు సంపాదించుకున్న ఈ నాటకంలోని అనేక ఘట్టాలను నటుడు చిరంజీవి 'సైరా' పేరుతో చలన చిత్రాన్ని కూడా తీశారు.
- రాష్ట్ర నంది నాటక పోటీలు ఆరంభమైన తరుణంలో అప్పటి వరకు జిల్లాకు అందని నంది బహుమతులను ఎలాగైనా సాధించాలనే తపనతో ఆయన దర్శకత్వం వహించిన మరో పౌరాణిక పద్య నాటకం 'నర నారాయణ'. ఈ నాటకం ఐదు నందులతోపాటు, ప్రత్యేక జ్యూరీ అవార్డును సొంతం చేసుకుంది. అలా ఆయన నాటక రంగంలో మొదలెట్టిన ప్రస్థానం అప్రతిహతంగా సాగుతోంది. ఆ జైత్ర యాత్రలో ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నారు. కందనవోలు పేరు ప్రఖ్యాతలను జాతీయ స్థాయిలో ఆయన నిలబెట్టారు. గత ఏడాది వరకు జరిగిన నంది నాటక పోటీల్లో ఆయన దర్శకత్వం వహించిన నాటకాలు 38 నంది అవార్డులతో రాష్ట్ర నాటక రంగ చరిత్రలోనే ఒక ప్రత్యేకత గుర్తింపు పొందాయి. ఆయనే కర్నూలుకు చెందిన రంగస్థల నటుడు, దర్శకుడు, రచయిత పత్తి ఓబులయ్య. వృత్తిరీత్యా సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి విశ్రాంతి తీసుకున్న ఆయన, కళామతల్లి సేవకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. కర్నూలు నాటక రంగం పేరు చెబుతూనే రాష్ట్ర స్థాయిలో గుర్తించే నాటక పురస్కారాల కృషీవలుడుగా రాణిస్తున్నారు. జిల్లా నాటక రంగానికి పత్తి ఓబులయ్య 40 ఏళ్లకు పైగా సేవలు అందిస్తున్నారు.



తానా పురస్కారం నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా అందుకుంటున్న పత్తి ఓబులయ్య

కుటుంబం, జీవిత నేపథ్యం...

ఆనాటి ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జె.పుల్లలచెరువు గ్రామంలో 1952 జనవరి 1న వ్యవసాయ కుటుంబంలో ఓబులయ్య జన్మించారు. తిరుపతిలో విద్వాన్, ఎంఏ తెలుగు పూర్తి చేశారు. అనంతరం కర్నూలు చేరుకొని 1980 నుంచి 2005 వరకు తెలుగు అధ్యాపకునిగా పని చేశారు. 2005 నుంచి 2010 వరకు సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి అక్కడే పదవీ విరమణ చేశారు. అప్పటికే నాటక రంగంలో ప్రవేశం ఉన్న ఆయన తొలుత సాంఘిక నాటకాలపై దృష్టి పెట్టారు. అలా నాటకాలు వేస్తూనే 2002 నుంచి ఇప్పటి వరకు లలిత కళాక్షేత్రం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 1999 నుంచి 2020 వరకు జిల్లా సాంస్కృతిక మండలి సభ్యుడిగా కొనసాగారు. 2017 నుంచి 2020 వరకు టీటీడీ ధర్మప్రచార మండలి జిల్లా అధ్యక్షుడిగా ధార్మిక సేవలు అందించారు.

'పులిస్వారీ'కి శాసన సభ కమిటీ అభినందనలు

పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించిన 'పులిస్వారీ' నాటకం రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. సుమారు 150కి పైగా వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చిన ఈ నాటకం రాయలసీమ ఫ్యాక్షన్ తీరును కళ్లకు కట్టేలా చూపారు. 1998లో నాటి కలెక్టర్, ఎస్పీల ప్రోత్సాహంతో ఉమ్మడి రాష్ట్రంలో ప్రదర్శనలివ్వడంతోపాటు ఈ నాటకాన్ని నాటి శాసనసభ కమిటీ వీక్షించి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. సీమలో ముఠా కక్షలు తగ్గడానికి ఈ నాటకం ఎంతో దోహదం చేస్తున్నదని, సీమలోని ఫ్యాక్షన్ పాతుకున్న పల్లె పల్లెల్లో ప్రదర్శించాలని సిఫారసు చేసింది. ఈ నాటకం 1999 నంది నాటక పోటీల్లో రెండు నంది బహుమతులు సాధించి పత్తి ఓబులయ్యకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అనంతరం ఆయన అనేక సాంఘిక నాటకాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శించారు.

పౌరాణిక పద్య నాటకాలకు ఊపిరి...

ప్రపంచ భాషల్లో ఒక్క తెలుగు భాషకే సొంతమైన పౌరాణిక పద్య నాటకం తెర మరుగవుతున్న తరుణంలో ఆ రంగానికి ఊపిరిలూదుతున్నారు పత్తి ఓబులయ్య. మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ల సహకారంతో, టీజీవీ కళాక్షేత్రం పక్షాన ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో నిర్వహించే పరిషత్తు నాటక పోటీల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నంది నాటక పోటీల్లో మహారథి కర్ణ, బభ్రువాహన విజయం, శ్రీకృష్ణాభిమన్యు, నరనారాయణ, సై...సైరా నరసింహారెడ్డి, కర్ణార్జునీయం, ప్రమీలార్జునీయం, శ్రీకృష్ణ కమలపాలిక నాటకాలకు దర్శకత్వం వహించి ప్రదర్శించి రాష్ట్ర జాతీయ పురస్కారాలు సాధించారు.





2017లో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి నంది పురస్కారం అందుకుంటున్న పత్తి ఓబులయ్య

నాటక రంగ ఖ్యాతిని చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నాం

పౌరాణిక పద్య నాటకాలకు రాయలసీమలో పల్లెపల్లెనా ఆదరణ ఉంటుంది. అలాగే నాటక రంగానికి పుట్టినిల్లుగా కర్నూలు నిలుస్తుంది. అందుకే జిల్లా ఖ్యాతిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో చాటి చెప్పే ప్రయత్నంగా వినూత్నంగా నాటకాలను ప్రదర్శిస్తున్నాం. ప్రదర్శించిన ప్రతిచోటా పురస్కారాలు వస్తున్నాయంటే నాతోపాటు సహ నటీనటుల కృషి కూడా ఎంతో ఉంది. ఇక టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడిగాను అనేక జాతీయ నాటక పోటీల ఏర్పాటుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కళాకారుల ప్రదర్శనలు ఇస్తున్నాం. స్థానిక కళాకారులకు కూడా ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

- పత్తి ఓబులయ్య, నాటక దర్శకుడు

అన్ని వర్గాలకు సమన్యాయం

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం
- అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ద్వారానే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్ బాషా, ఎమ్మెల్సీ మధుసూదన్, పాణ్యం, ఆదోని, ఆలూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, పార్థసారధి, విరూపాక్షి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులు రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎంతో మంది మహానుభావులు దశాబ్దాల తరబడి చేసిన త్యాగాల ఫలితమే దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయని, ఆ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా అంబేడ్కర్ నేతృత్వంలో ఒక గొప్ప రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగం ద్వారా దేశాన్ని అన్ని విధాలా పురోగతి వైపు ఏ విధంగా తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి టీజీ భరత్

ప్రతి పౌరుడు రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి : కలెక్టర్

సమాజంలో ప్రతి పౌరుడు భారత రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగంలో పౌరుల మౌలిక హక్కులు, విధులు, బాధ్యతలు, స్వేచ్ఛ సమానత్వం, ఆర్థిక సామాజిక న్యాయం వంటి అంశాలను స్పష్టంగా పొందుపరిచి ఒక గ్రంథంగా మనకు అందించారని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా కృషి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజ్యాంగం పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు.

భక్తి భావం పెంచుకోవాలి

త్రిదండి యదుగిరి రామానుజ జీయర్ స్వామిజీ



ప్రసంగిస్తున్న రామానుజ జీయర్ స్వామిజీ

కర్నూలు కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తిభావనలు పెంచుకోవాలని, ధార్మిక మార్గం ఒక్కటే సమాజాన్ని శాంతియుతంగా నిలుపుతుందని మైసూరులోని మేల్కోట తిరునారాయణ క్షేత్రం 41వ పీఠాధిపతి త్రిదండి యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్ స్వామిజీ భక్తులకు పిలుపునిచ్చారు. మంగళవారం నగర శివారులోని గోదా గోకులం (శ్రీగోదా రంగనాథస్వామి) క్షేత్రానికి స్వామిజీ విచ్చేశారు. ఆలయంలోని గోదాదేవి అమ్మవారికి, రంగనాథస్వామి వార్లకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. రామానుజాచార్యుల వారు హిందూ ధర్మాన్ని దేశంలో నలుదిశలా చాటి చెప్పారని అన్నారు. గోదా గోకుల క్షేత్రంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, భక్తులను ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.

సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి సహకరించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు నిరంతరం సేవలు అందిస్తూ యుద్ధ సమయంలో అమరులు అయిన, పదవీ విరమణ చేసిన సాయుధ దళాల కుటుంబాల సంక్షేమానికి ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో త్రివిధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సాయుధ దళాల పతాక స్టిక్కర్స్, కార్ ఫ్లాగ్స్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్రివిధ దళాల సేవలు కీలకమని, దేశ సేవలో వీర జవానుల సేవలు మరువలేనివన్నారు. ప్రతి ఏడాది డిసెంబరు 7న దేశవ్యాప్తంగా సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకుంటామన్నారు. సాయుధ దళాల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక నిధికి విరివిగా విరాళాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైనిక వెల్ఫేర్ అధికారి రత్న రూత్, సూపరింటెండెంట్ మహేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.



విదేశీ కరెన్సీ నోట్లు



స్వదేశీ కరెన్సీ నోట్లు

రూ.40 లక్షల విలువైన కరెన్సీ నోట్ల ప్రదర్శన

బేతంచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ధరణీ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్రహం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సుమారు 200 పైగా దేశ విదేశాల సుమారు రూ.40లక్షల విలువైన నోట్లు, నాణేల ప్రదర్శనను విద్యార్థులకు మంగళవారం నిర్వహించారు. ఇందులో ఆయాదేశాల్లో గతంలో, ప్రస్తుతం వాడుకలో ఉన్న నోట్లు, నాణేలను ప్రదర్శించారు. అదే విదంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ వైజ్ఞానిక నమూనాలను ప్రదర్శించారు. ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జనార్దన్, ఉమామహేశ్వరమ్మ, చిన్నయ్య, ఉపాధ్యాయులు మురికి నీటి నుంచి స్వచ్ఛమైన నీరు తయారు చేయడం, కాలుష్య వాతావరణం లేని పాఠశాల, ఇళ్ల నిర్మాణం మొదలైన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని మండల విద్యాధికారి సోమశేఖర్ పరిశీలించి అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు

జిల్లా క్రీడాకారులు



టీజీ వెంకటేశ్‌తో ఉషూ క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఈ నెల 29 నుంచి డిసెంబరు 4 వరకు జరిగే 22వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఉషూ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఎస్ఎండీ సాద్‌బాషా, ఎం.పవన్, ఎస్ఎండీ జాద్‌బాషాల మంగళవారం మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌ను కలిశారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని టీజీ పిలుపునిచ్చారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మల బెడద

(5వ పేజీ తరువాయి)

సమగ్ర భూసర్వేలో భాగంగా పొలాల్లో పాతిన రాళ్లపై జగన్ బొమ్మను చెరిపేసేందుకు రూ.15 కోట్లు ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం అంచనా వేసింది. ఈ పనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, డిసెంబరు నెలాఖరు నాటికి ఎక్కడా సర్వే రాళ్లపై జగన్ ఫొటో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం ఇచ్చింది. అదే విదంగా రైతులకు అందించిన భూహక్కు పత్రాలపై కూడా జగన్ బొమ్మను తొలగించేందుకు కూడా కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కర్నూలు జిల్లాలో 3 విడతల్లో కలిపి 86,900 భూహక్కు పత్రాలు, అదే విదంగా నంద్యాల జిల్లాలో 73,750 భూహక్కు పత్రాలు రైతులకు అందజేశారు. రైతుల పాసు పుస్తకాలపై పాలకుల బొమ్మలు ఉండడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు ఇవ్వాలనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఈ మేరకు ప్రస్తుతం ఉన్న ఈ భూహక్కు పత్రాలు రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజముద్రతో రైతులకు త్వరలోనే పాసు పుస్తకాలు అందిస్తామని ప్రకటించింది.

సర్వే రాళ్లపై బొమ్మలను చెరిపేస్తున్నాం



కర్నూలు జిల్లాకు రెండున్నర లక్షల సర్వే రాళ్లను ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి తెప్పించారు. మరో 50వేల సర్వేరాళ్లు రైతుల పొలాల్లో పాతాల్సి ఉంది. కొన్ని సర్వే రాళ్లు ఆయా గ్రామాల్లోని రైతు సలహా కేంద్రాల వద్ద ఉన్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత కూటమి ప్రభుత్వం చెప్పిన ప్రకారం సర్వే రాళ్లపై బొమ్మలను చెరిపేసే కార్యక్రమం చేపడుతున్నాం.

- మునికన్నన్, సర్వే ల్యాండ్స్ డిప్యూటీ డైరెక్టర్

నీటి కోసం గళమెత్తారు..!

- వాడీవేడిగా ఐఏబీ సమావేశం
- సాగు, తాగునీటి కోసం ఎమ్మెల్యేల పట్టు
- ఎల్లెల్సీ, హంద్రీనీవా విస్తరణతో మరో 10 టీఎంసీలకు కార్యాచరణ



కర్నూలుకు పది టీఎంసీలు కేటాయించండి

- గౌరుచరిత, ఎమ్మెల్యే

కర్నూలు జిల్లా ప్రతి ఏటా కరువు పరిస్థితులు ఎదుర్కొంటోందని, రైతులు కూలీలు, కుటుంబ పోషణ కోసం పక్క జిల్లాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. హంద్రీనీవా, కేసీ కెనాల్, ఎల్లెల్సీ, జిల్లా గుండా ప్రవహిస్తూనే ఉన్నా ఈ పరిస్థితి నెలకొనడం విచారకరమన్నారు. వెంటనే రెండు సీజన్లలో స్థిరీకరించిన ఆయకట్టుకు నీరందించాలని, వలసలను ఆపాలని మంత్రితో పాటు కలెక్టర్‌కు ఎమ్మెల్యే గౌరు చరిత విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా హంద్రీనీవా కాలువ వెడల్పుతోపాటు లైనింగ్, తదితర వాటికి ప్రభుత్వం నిధులు కేటాయించినందున 40టీఎంసీల నుంచి మరో 20 టీఎంసీల నీరు అదనంగా పెరిగే అవకాశం ఉందని ఈ మొత్తంలో 10 టీఎంసీల నీటిని కర్నూలు జిల్లాకు కేటాయించాలని తీర్మానం చేయాలని గౌరు చరిత పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య ఇకపై ఉండరాదని, ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డును కర్నూలులో ఏర్పాటు చేస్తానే రాయలసీమకు న్యాయం జరుగుతుందని గౌరు చరితమ్మ స్పష్టం చేశారు.

(5వ పేజీ తరువాయి)

ఐఏబీ సమావేశంలో మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు బాగా పడ్డాయని, అందువల్ల ఎక్కడా తాగునీటి సమస్య వచ్చే అవకాశం ఉండకూడదన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి సమస్యను అత్యధిక ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సప్లయ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, సీపీడబ్ల్యూఎస్ పథకం కింద పిల్టర్ బెడ్స్, ఓ అండ్‌ఎం విభాగంలో సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అధికారులను మంత్రి ప్రశ్నించారు. కొన్ని చోట్ల ఫిల్టర్ బెడ్స్‌తో పాటు ఓఅండ్‌ఎం సమస్యలు గుర్తించామని, ఈ అంశంపై నిధుల మంజూరు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు అధికారులు తెలిపారు. ఆ ప్రతిపాదనల వివరాలు తనకు అందించాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి చోరీ కేసులపై సమావేశంలో చర్చించారు. రూ.2.6 కోట్ల విలువ చేసే ఆయిల్‌తో పాటు కాపర్ చోరీ జరిగిందని, మోటార్లు రన్నింగ్ కండీషన్‌లో తీసుకువచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ బాల చంద్రారెడ్డి తెలిపారు.

ప్రతి గ్రామాన్నీ సందర్శించండి : కలెక్టర్



జిల్లాలో ప్రతి గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డీపీవోతో పాటు జడ్పీసీఈవోను ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు కూడా ఈ అంశంపై ఎప్పటికప్పుడు ఆయా విభాగాల అధికారులతో సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి పథకాలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉంటే వెంటనే జడ్పీ మండల నిధుల నుంచి మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్ద సమస్యలు ఉంటే తక్షణమే నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్‌ఎస్ ట్యాంకులు, చెరువులు వెంటనే హంద్రీనీవాతోపాటు ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నుంచి నింపాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడంలో బాధ్యతలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో 68 చెరువులను హంద్రీనీవా కాలువ నీటితో మార్చిలోపు నింపాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆర్థిక సంఘం నిధులు తాగునీటికే...

ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ రాబోయే వేసవిలో ఆదోని పట్టణానికి తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే అధికారులు కార్యచరణతో పనులు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదలయ్యాయని, ఆ నిధులను తాగునీటి సమస్యలు తీర్చేందుకు మాత్రమే వినియోగించుకోవాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఖరీఫ్‌లో 20వేల ఎకరాలకు నీటిని విడుదల చేశామని, రబీలో 3,600 ఎకరాలకు ఎల్లెల్సీ ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రతిపాదించడం జరిగిందని ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్ మంత్రికి తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి మాట్లాడుతూ ఎల్లెల్సీ కాలువ నుంచి ఏప్రిల్ 15వ వరకు పంటలకు నీరు అందించాలని దేవనకొండ మండలంలో చెరువులకు మరమ్మతులు చేయించాలని, ఆలూరు చెరువును ఎస్‌ఎస్ ట్యాంకుగా మార్చాలని, గంజేహళ్లి, బాపురం, చింతకుంట చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జలవనరుల శాఖ ఎస్‌ఈ బాల చంద్రరెడ్డి, హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్‌ఈ రామగోపాల్, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్, ఎల్లెల్సీ ఈఈ శైలేశ్వర్, ఆర్డీఎస్ ఈఈ బాస్కర్ రెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రామకృష్ణతో పాటు ఆర్డీవోలు ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఎమ్మెల్యేలు పార్థసారథి, విరూపాక్షి

ఐఏబీ సమావేశంలో కీలక తీర్మానాలు:

- కేసీ కేనాల్ కింద ప్రస్తుతం ఎక్కువ ఆయకట్టు నంద్యాల జిల్లాలో ఉన్నందున అక్కడ నిర్వహించే ఐఏబీ సమావేశంలో ఎంత ఆయకట్టుకు నీరందించవచ్చునో నిర్ణయం తీసుకోవాలి.
- ఎల్లెల్సీ కింద ఆయకట్టుకు డిసెంబరు 10 నుంచి మార్చి ఆఖరి వరకు నీటిని అందించాలి.
- హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ప్రతిపాదిక విస్తరణ పనులు జరిగే అవకాశం ఉన్నందున అదనంగా లభించే నీటిలో కర్నూలు జిల్లాకు 10 టీఎంసీలు ప్రభుత్వం కేటాయించాలి.
- గాజులదిన్నె ప్రాజెక్టు కింద నవంబరు 30 నుంచి 15వేల ఎకరాలకు సాగునీటిని అందించాలి.
- వచ్చే మార్చి ఆఖరు నాటికి 68 చెరువులకు నీటిని నింపే కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.
- కృష్ణ, తుంగభద్ర తదితర ఉప నదులు కర్నూలు మీదుగానే ప్రవహిస్తున్నాయి. అందుకోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు అణువుగా కర్నూలు కేంద్రంగా కృష్ణా మేనేజ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేయాలి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- భార్యపైనే అనుమానం

కొలిమిగుండ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పేట్నీకోట గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గొల్ల పామిడి రమేష్(40) అనే వ్యక్తి ఇంట్లో మద్యం మత్తులో మృతి చెందినట్లు అతడి భార్య మంగళవారం బంధువులకు, గ్రామస్థులకు తెలిపింది. అయితే, ఈ ఘటన అనుమానాస్పదంగా ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేష్‌బాబు చేరుకొని విచారణ చేపట్టగా భార్య పొంతనలేని సమాధానం చెప్పడంతో, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, మృతుడి భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె కాల్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సోదరి గూటం రమాదేవి ఫిర్యాదు మేరకు మృతుడి భార్యతో పాటు, గోపాల్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. మంగళవారం ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న చిన్నవంగలి గ్రామానికి చెందిన నారాయణమ్మ (61) గీజర్ ఆన్ చేయగా ప్రమాదవశాత్తు పేలింది. దాంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబీకులు కడప జిల్లా ప్రొద్దుటూరు వైద్యశాలకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ నారాయణమ్మ మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

కౌతాళం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంబళనూరు గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయింది. మంగళవారం ఎమ్మిగనూరు డీస్పీ ఉపేంద్ర బాబు, కౌతాళం సీఐ అశోక్ బాబుతో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో ఈరన్నను కులం పేరుతో అదే గ్రామానికి చెందిన ఎనిమిదిమంది బీసీ కులస్తులు దూషించినట్లు ఈరన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కౌతాళం సీఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం సాయంత్రం కుంబళనూరు గ్రామానికి వచ్చి దూషించినట్లు తెలిపిన ప్రదేశంలో ఫిర్యాదుదారునిని విచారించి దర్యాప్తు చేపట్టారు. కేసును విచారించి ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాలను సేకరించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వీరి వెంట కౌతాళం సీఐ అశోక్ కుమార్ పోలీసులు ఉన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం, వ్యక్తి అరెస్టు

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఈడిగ జయరాముడును అరెస్టు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం రాఘవేంద్రపురంలో రహస్యంగా వచ్చిన సమాచారం మేరకు ఈడిగ రాముడుని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 19 రాయల్ స్టాగ్ క్వాటర్ బాటిళ్ల మందును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ కు తరలించినట్లు తె లిపారు. మంత్రాలయంలో కర్ణాటక మద్యం అమ్మినా.. బెల్టు షాపులు నిర్వహించిన ఉపేక్షించేది లేదని, కేసులు నమెదు చేసి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వెలుగోడు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలివీ.. వేల్పనూరుకు చెందిన వెంకటేశ్వర్లు(58), శ్రీనివాసులు గ్రామం నుంచి నుంచి ద్విచక్ర వాహనంపై వెలుగోడుకు బయలు దేరారు. వెలుగోడు నుంచి సరుకుల లోడ్‌తో ఓ వాహనం బయలుదేరింది. అయితే అబ్దుల్లాపురం, వేల్పనూరు గ్రామాల రహదారిలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. వెంకటేశ్వర్లుకు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాసులుకు కుడి కాలు విరగడంతో నంద్యాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆదోని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణం కార్వాన్ పేట వీధికి చెందిన షేక్ షబ్బీర్ (30) అనే యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే జీఆర్‌పీఎఫ్ పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



షేక్ షబ్బీర్ (ఫైల్)

ఆరబెట్టిన మిరప పంటకు నిప్పు

- రూ. 3 లక్షల ఆస్తినష్టం
- గుర్తు తెలియని వ్యక్తుల పనే..



కాలిపోతున్న మిరప దిగుబడి, ఇన్‌సెట్‌లో బాధిత రైతు శ్రీనివాసులు

ఎమ్మిగనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన మిరప పంటను గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి తగులబెట్టారు. ఈ ఘటన ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఎర్రకోట గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. దీంతో మిరప పంట కాలిబూడిదై రూ.మూడు లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత రైతు శ్రీనివాసులు వాపోయాడు. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీనివాసులు తనకున్న మూడు ఎకరాలలో మిరప సాగుచేశాడు. దాదాపు రూ. మూడు లక్షలు ఖర్చు చేశాడు. 20రోజుల క్రితం పంట చేతికి రావటంతో 12క్వింటాళ్ల మిరపను తెంచి కర్నూలు రహదారి సమీపంలో ఓ పొలంలో ఆరబెట్టాడు. ఒకటి రెండు రోజుల్లో మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మిరప పంటపై పెట్రోల్ చల్లి నిప్పుపెట్టి పరారయ్యారు. మంటలు చూసిన ఎదురుగా ఉన్న ఇంజనీరింగ్ కళాశాల దగ్గర ఉన్న వ్యక్తులు చూసి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు, రైతు శ్రీనివాసులు కల్లం దగ్గరకు చేరుకొని చూసే సరికి పంట కాస్త కాలిబూడిదయ్యింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు మాట్లాడుతూ రూ.లక్షలు ఖర్చుచేసి సాగుచేసిన పంట చేతికొచ్చిందనుకున్న సమయంలో దుండగులు నిప్పు పెట్టడంతో కాలిబూడిదయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

నిధులు దుర్వినియోగం చేశాడని ఫిర్యాదు

శిరివెళ్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాక అధ్యక్షుడు సతీష్ కుమార్, ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్‌కు మంగళవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. 2018 నుంచి 2023 వరకు పాఠశాలకు మంజూరైన పలు రకాల నిధులను అప్పటి హెచ్‌ఎం బోగస్ బిల్లులు సమర్పించ డంతో పాటు బిల్స్ టాంపరింగ్ చేసి రూ.34,590 దుర్వినియోగం చేసినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి తెచ్చామన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలతో ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సదరు హెచ్‌ఎంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిధులను రికవరీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు బీటీఎఫ్ సతీష్ కుమార్ వెల్లడించారు.



శిరివెళ్ల ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న సతీష్ కుమార్

ప్రజాస్వామ్య రక్షణలో రాజ్యాంగం పాత్ర కీలకం

- నంద్యాల జేసీ విష్ణుచరణ్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జేసీ, తదితరులు

నంద్యాల కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణలో రాజ్యాంగం కీలక పాత్ర వహిస్తోందని నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1949 నవంబరు 26 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. రాజ్యాంగంలోని మార్గదర్శకాల మేరకే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. రాజ్యాంగ బద్ధంగానే అసెంబ్లీ, పార్లమెంట్‌లో నూతన విధానాలను ప్రవేశపెట్టి ఆ మేరకే అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలుపరిచే విధానాలు, కోర్టు ఉత్తర్వులు కూడా రాజ్యాంగాన్ని అనుసరించే ఉంటాయన్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.1.28 లక్షల నగదు, ఐదు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం

మంత్రాలయం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్టు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్ఐ పరమేశ్ నాయక్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రహస్య సమాచారం మేరకు తుంగభద్ర నది బూదూరు పంప్‌హౌస్ వద్ద ఆదోని, ఎమ్మిగనూరుకు చెందిన పదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. అరెస్టుచేసి రూ.1.28 లక్షలు, ఐదు బైకులు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరుస్తా మని తెలిపారు. సిబ్బంది రామకృష్ణ, లక్ష్మణగౌడు, నాగేశ్వరరెడ్డి, సోమ్లా నాయక్ ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

కర్నూలు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగారుపేటలో సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం 2,700 బెల్లం ఊట, 85 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకు న్నామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఎం.కన్య, బోయ మద్దమ్మ, బోయసుధాకర్‌లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. సీఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ సూపర్‌వైజర్‌గా పి. వెంకటన్న

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య జోన్-4 పరిధిలోని 11 మంది హెల్త్ అసిస్టెంట్లకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. హుశేనాపురం పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.వెంకట న్నకు హెల్త్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి కల్పించి నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టుకు పోస్టింగ్ వేశారు. జోన్-4 పరిధిలో హెల్త్ సూపర్‌వైజర్ల పదోన్నతుల్లో ఉమ్మడి జిల్లా నుంచి పి.వెంకటన్న ఒక్కరికే పదోన్నతి లభించడం విశేషం.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు
- ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి అభినందనలు



సిబ్బందిని అభినందిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాలిన రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. జీజీహెచ్‌కు చెందిన ఎంఎన్‌వో రాజశేఖర్, ఎఫ్ఎన్‌వో జయమ్మ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ అండ్ బర్న్ సర్జరీపై ఐదు రోజుల శిక్షణ పొందారు. శిక్షణను పూర్తి చేస్తున్న ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు మంగళవారం సూపరింటెండెంట్ చాంబరులో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, ప్లాస్టిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.మంజుల బాయిని అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న మెలకువల వల్ల రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. శిక్షణల వల్ల సిబ్బందిలో నైపుణ్యం పెరుగు తుందన్నారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేడ్కర్‌కు నివాళి అర్పించిన రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు



నంద్యాల డీఎస్పీ కార్యాలయంలో..

నంద్యాల కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సాయిధ బలగాల డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, నాగభూషణం, ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల క్రైం: నంద్యాల డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డీఎస్పీ పి.శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

● నంద్యాలలోని న్యాయవాది ఎం.వెంకటేశ్వరుడు కార్యాలయంలో మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. మాదిగ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరుడు, జాయింట్ సెక్రటరీ వనం శ్రీనివాసులు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, జగదీష్, శంకర్ పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పట్టణంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయం, విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ ఈఈ(టెక్నికల్) పెద్దయ్య, ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమళ్ల రహీం, మునిశేఖర్, విద్యుత్‌శాఖ డీఈఈ రమేష్‌కుమార్, డీ2, డీ3 ఏఈలు రామయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్: కొణిదేలలో జడ్పీ హైస్కూల్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి హెచ్ఎం, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. నాగటూరులో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమారెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి, మిడుతూరు రోడ్డు కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రాహానికి వైసీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి ధారాసుధీర్ పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం శ్రీరామచంద్ర మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానంది: మహానంది ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి, శాస్త్రవేత్తలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

మిడుతూరు: మిడుతూరులోని ఎంపీడీవో కార్యాలయం, కేజీబీవీలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కేజీబీవీలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బహుమతులు అందజేశారు. ఎంపీడీవో దశరథరామయ్య, ఏవో సురేష్, పీఎస్‌లు గోవిందు, అనూరాధ పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు నల్లమల అబ్రహం పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రజా సంఘాల నాయకులు రాబిన్‌సన్‌రాజు, దరగయ్య, మల్లయ్య, శీలం శేషు, టపాల్ అష్రఫ్‌అలీ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఆర్ డీఎస్పీ

బండిఆత్మకూరు: శింగవరంలోని అమృత్ సరోవర్ పథకం వద్ద ఎంపీడీవో దస్తగిరి, ఏపీవో వసుధ ఉపాధి కూలీలతో కలిసి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కోర్స్ డైరెక్టర్ ఇస్మాయిల్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పాణ్యం: పాణ్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు, అధికారులు, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలుల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈవోఆర్డీ చందమౌళీశ్వరగౌడ్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దానం, టీడీపీ నాయకులు రామ్మోహన్‌నాయుడు, ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, మాలమహానాడు నాయకులు దత్తు, శివకృష్ణ యాదవ్, ప్రతాప్, రాజేష్, రాజేంద్ర, బాలసుబ్బయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామన్, అధ్యాపకులు జాషువా, శ్రీనివాసులు, ఖాద్రి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గడివేముల: గడివేములలోని కేజీబీవీలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో విమలావసుంధరాదేవి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి రుబీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

జూపాడుబంగ్లా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లాలోని మోడల్ స్కూల్‌లో బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సమావేశ భవనంలో మంగళవారం 11 గంటలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి వైస్‌ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు హాజరు కావాలని సూచించారు.

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

ఆత్మకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో బుధవారం ఉదయం 10గంటలకు టీడీపీ శ్రీశైలం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్న ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని మండలాల నుంచి టీడీపీ అధ్యక్షుడు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, ముఖ్యనాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

నంద్యాల, నవంబరు 26 : (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ ట్రోఫీని జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నట్లు ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. గత ఆదివారం ప్రొద్దుటూరులో జరిగిన ఏపీ ఓపెన్ జీత్ ఫునేడో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నంద్యాల క్రీడాకారులు 12స్వర్ణ, 12రజత, 15కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకున్నారని చెప్పారు. మంగళవారం నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరాటే సంఘం ప్రధాన కార్యదర్శి మాస్టర్ బాలకృష్ణ, నవీన్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.







మంత్రి లోకేశ్‌ను కలిసిన నాయకులు



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రాముడు

బండిఆత్మకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉండవల్లిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం బుడగ, బేడ జంగాల సంఘం అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గ రాముడు, మహేష్ తారక్ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. బుడగ, బేడ జంగాల కుటుంబాలు నేటికీ పేదరికంలోనే జీవనం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బేడ, బుడగ జంగం కులం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో విద్య, సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అలానే రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్ జిల్లాల వారీగా చేస్తున్న పరిశీలనలో బేడ, బుడగలను ఎస్సీలో పొందుపరిచేలా చూడాలని వారు కోరారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేయాలి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

ఆత్మకూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల బలోపేతానికి మహిళా సమాఖ్య అన్ని విధాలుగా కృషి చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన మండల సమాఖ్య ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యేను వేల్పనూరులోని ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారిని ఆయన పలు సూచనలు ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, ఏపీఎం ఉమామహేశ్వరమ్మ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనసూయమ్మ, ఉపాధ్యక్షురాలు మల్లికమ్మ, కార్యదర్శిడు కోశాధికారి భ్రమరాంబిక, పొదుపు సంఘాల మహిళలు ఉన్నారు.

'గౌరవ వేతనం ఇవ్వాలి'

నంద్యాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి గౌరవ వేతనం ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిప్రకాష్, అశోక్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేరెంట్ కమిటీని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీగా మార్పుచేస్తూ ఉత్తర్వు 37ను జారీ చేయడంవల్ల పాఠశాలలపై కమిటీకి బాధ్యత పెంచినట్లయిందని అన్నారు. ఎస్ఎంసీ విధులు, నిధులపై ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయాలని వారు కోరారు. ఎస్ఎంసీ బాధ్యతలు ఉపాధ్యాయులపై పడకుండా చూడాలన్నారు. ఎస్ఎంసీ ఎన్నికకు కనీస విద్యార్హత ఉండేటట్లు చట్టాల్లో మార్పులు తీసుకురావాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం ఎన్నిక

పాములపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాములపాడు మండలంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా, ఎన్నికల పరిశీలకులు దామరేకుల రవి, హుసేన్ సాహెబ్ సమక్షంలో మంగళవారం పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా హరినాథ్ బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా రమణయ్య, ఉపాధ్యక్షులుగా సాయిరాం, మహిళా ఉపాధ్యక్షురాలిగా జరీనాబేగం, కార్యదర్శులుగా వెంకటకృష్ణ కుమార్, కామేశ్వరుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లు వెంకటసుబ్బయ్య, నాగమయ్య, నాగ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'సహకరించకపోతే కూల్చడం ఖాయం'

పాములపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులకు అందరు సహకరించి అభివృద్ధికి సహకరించాలని ,లేదంటే కూల్చడం ఖాయమని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. రుద్రవరం గ్రామ శివార్లలో గల జెరుషలేం చర్చి నిర్వాహకులతో మంగళవారం మాట్లాడారు. నేషనల్ హైవే అధికారులు మార్కింగు ఇచ్చిన వరకు సామగ్రిని తొలగించుకోవాలని సూచించారు అయితే నిర్వాహకులు మాట్లాడుతూ మందిరానికి ఇబ్బంది కల్గించకుండా పనులు చేపట్టాలన్నారు. హైవే పనుల్లో చాల చోట్ల మలుపులు ఉన్నాయని, అలాగే ఇక్కడకూడ వీలు కల్పించాలని కోరారు. దీంతో ఇప్పటికే రెండు సార్లు నోటీసులు అందించిన ఎలాంటి సమాధానం రావడం లేదని తహసీల్దార్ తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు హైవే అధికారులు సూచించిన కొలతల వరకు తొలగించాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే కోరిన మేరకు గడువు ఇచ్చామని తహసీల్దార్ చెప్పారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

● మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాటసాని

పాణ్యం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం నడవడం లేదని లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాణ్యంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని అన్నారు. పోలీసులు టీడీపీ నాయకులు చెప్పినట్లు వింటున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు కంటితుడుపు చర్యగా ఉన్నాయ న్నారు. మీడియా నిజానిజాలు రాయాలన్నారు. సర్పంచ్ పల్లవి, ఎంపీపీ ఉశేన్‌బీ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ సూర్య నారాయణరెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు విస్తీర్ణం పెంచాలి: డీఏవో



తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో కందిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జూపాడుబంగ్లా, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఏడాదికేడాది సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రాన్ని 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. క్షేత్రం ఏడీఏ అరుణలతను క్షేత్రంలో సాగువిస్తీర్ణం, బీడుభూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగుచేసిన కందిపంటను పరిశీలించారు. ప్రభుత్వం జంగిల్ క్లియరెన్సు చేయిస్తే సాగువిస్తీర్ణం పెంచడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: రైతులు పంట పొలాల్లో భూసారాన్ని పెంచుకుని సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. అబ్దుల్లాపురంలో నిర్వహించిన పొలం పిలు స్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏవో పవన్ కుమార్, పశువైద్యాధికారిణి జ్యోత్స్న, సెరికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గడివేముల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపాడు గ్రామంలో మంగళవారం ఎంపీడీవో వాసుదేవగుప్తా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రంలోని స్టాక్ వివరాలను ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. అనంతరం తిరుపాడు గ్రామ పంచాయతీలో జరిగిన పారిశుధ్య పనులను పరిశీలించారు.

'రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలి'

నందికొట్కూరు రూరల్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో రైతులకు ఉనయోగ పనులను గర్తించి వాటిని త్వరిత గతిన చేయాలని నందికొట్కూరు ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ ఉపాధి సిబ్బందికి సూచించారు. బ్రాహ్మణ కొట్కూరులో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఏపీవో అలివేలు మంగమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

'సొంత జిల్లాలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేయాలి'

పాణ్యం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సొంత జిల్లాలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు దాసు, వనం రాజు కోరారు. మంగళవారం వారు పాణ్యంలో జరిగిన సదరం క్యాంపును సందర్శించారు. వారు మాట్లాడుతూ క్యాంపులో పక్షవాతానికి ప్రత్యేక వైద్యుడు లేకపోవడంతో జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయడంతో దివ్యాంగుల తీవ్రి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పాణ్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే సదరం క్యాంపుల్లో ఆర్థోపెడిక్ వికలాంగులకు మాత్రమే ప్రాధాన్యత ఉండడంతో పక్షవాతం వికలాంగులకు పాణ్యం ఆసుపత్రిని కేటాయించడంతో పాటు పక్షవాత వికలాంగులకు పాణ్యం కేటాయించడంతో వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాణ్యం ఆర్థోపెడిక్ సదరం క్యాంపుకు చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరురూరల్ నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ సెపక్‌తక్రా క్రీడా పోటీలను శ్రీనవనంది పాఠశాలలో సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలన్నారు. పాఠశాల కరస్పాడెంట్ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నాయకులు కాతారమేష్‌రెడ్డి, పలుచాని మహేశ్వరెడ్డి, దేశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే

కొత్తపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం సంగమేశ్వరం వద్ద జానాల గూడెం విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్ కుమార్, ఏడీ రామసుబ్రహ్మణ్యం, డీఈ జయశంకర్, ఏఈ అబ్దుల్ హబీబ్, మండల అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఎస్ఈ సుధాకర్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంగమేశ్వరం నుంచి పాత సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు సుమారు 7 కి.మీ.ల మేర విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. 20 రోజుల్లో పనులు పూర్తి చేసి పై మూడు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామన్నారు. లోవోల్టేజీ సమస్యను అధికమించేందుకు దుద్యాల, ఎర్రమటం గ్రామాల మధ్య విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కొత్తపల్లిలో సిరిగిరి బాలస్వామికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.30,780ల చెక్కును, నాగంపల్లిలో వెంకటనారాయణకు రూ.1,50,780ల విలువగల చెక్కును అందజేశారు. తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరి, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'నీరు పొదుపుగా వాడుకోవాలి'

కొత్తపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య రైతులకు సూచించారు. మంగళవారం ముసలిమడుగు గ్రామ శివారులోని శివపురం ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 80 క్యూసెక్కుల నీటిని డీసీల ద్వారా ఎమ్మెల్యే రైతులకు సాగునీరు విడుదల చేశారు. గత కొంత కాలంగా మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకం మోటార్లను రైతులే సొంతంగా నిధులతో మరమ్మతులు చేయించుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులు నీటిని విడుదల చేయించారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, నారపురెడ్డి, శివారెడ్డి, వెంకటరెడ్డి, మల్లయ్య, ఏ.దర్గయ్య, వీఆర్వో మౌలాలి, సినిమా దర్గయ్య పాల్గొన్నారు.

శ్రీగిరిపై కార్తీక శోభ



ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నదాన భవనంలో ఉదయం 10.30 నుంచి 3.30 వరకు భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటల నుంచి అల్పాహారం అందజేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆయా సదుపాయాలను కల్పించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

ఆకాశ దీపోత్సవం: ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ ఆకాశదీప కార్యక్రమంలో దీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగాలని గణపతి పూజను నిర్వహించి, దీపప్రజ్వలన, దీపారాధనలను జరిపారు.

విశేష పూజలు: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రీ సర్వే సమస్యలపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

- తహసీల్దారు శ్రీనివాసులు

ఉయ్యాలవాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఆయా గ్రామాల సర్వేయర్లలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రీ సర్వే గ్రామాల్లో 248 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని ఏ విధంగా పరిష్కరించాలన్న దానిపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- డీఎల్‌డీవో శివారెడ్డి


ఇంటింటి సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎల్‌డీవో శివారెడ్డి

ఉయ్యాలవాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌డీవో శివారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంటులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి రోజు ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయాలన్నారు. అలాగే ప్రభుత్వ సర్వేలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వేను అన్ని శాఖల సచివాలయ ఉద్యోగులతో కలిసి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమమహేశ్వరరావు ఉన్నారు.

రుద్రవరం: జిల్లాలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. మంగళవారం రుద్రవరంలో సమావేశ భవనంలో నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పనవేళలు పాటించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతగల భోజనం ఇవ్వాలని తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, కోడిగుడ్డు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల గ్రేడింగ్, రికార్డులను పరిశీలించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషాద్రి పాల్గొన్నారు.

అమ్మవారికి సామూహిక ఒడి బియ్యం


గంగా భవాని ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గంగమ్మ పాత శివాలయంలో మంగళవారం సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమం చేశారు. మండల సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విష్ణు సహస్రపారాయణం, దీపోత్సవం కార్యక్రమాలు చేశారు. శివపార్వతుల పల్లకి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పిల్లర్లకే పనులు పరిమితం

ఐదేళ్లయినా పూర్తి కాని తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులు

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో టీడీపీ ప్రభుత్వ హయంలో ప్రారంభించిన తహసీల్దార్ భవన నిర్మాణ పనులు నేటికి పిల్లర్లకే పరిమితమైంది. ఈ భవనానికి రూ.95 లక్షలు నిధులు టీడీపీ ప్రభుత్వ హయంలో మంజూరయ్యాయి. దీంతో పనులు ప్రారంభించి పిల్లర్ల వరకు వేసి నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో పిల్లర్లకే భవన నిర్మాణ పనులు పరిమితమయ్యాయి. ఐదేళ్లు పూర్తయిన భవన నిర్మాణ పనులు చేపట్టలేదు. పంచాయతీరాజ్ అధికారులు రెండు విడతలుగా భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు పంపించిన ఫలితం లేదు. వైసీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. తహసీల్దార్ కార్యాలయ భవనం లేక పోవడంతో ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం లేక ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ ప్రభుత్వంలోనైన తహసీల్దార్ కార్యాలయ భవన పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.


చాగలమర్రిలో పిల్లర్లతో ఆగిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

బేతంచెర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సంకలాపురం గ్రామంలో 15 లక్షలతో డ్రైనేజీ కాలువలతో పాటు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా సీసీ రోడ్లను ఎమ్మెల్యేల కోట్ల, మండల టీడీపీ కన్వీనర్ ఎల్ల నాగయ్య అధ్యక్షతన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్ల ఏర్పాటు గ్రామాలభివృద్ధి టీడీపీ కృషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సంక్షేమాన్ని గ్రామాల అభివృద్ధిని విస్మరించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, పీఆర్‌డీ గంగాధర్, పీఆర్‌డబ్లఎస్ ఏఈలు మహేష్, రాజశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు తిరుమలేష్ చౌదరి, నాయకులు చంద్రశేఖర్, మల్లికార్జున, హనుమంత రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంకలాపురంలో సీసీరోడ్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాష్ రెడ్డి

బండలాగుడు పోటీలను ప్రారంభం

వీరబ్రహ్మేంద్రస్వామి తిరుణాల మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని సంకలాపురం గ్రామంలో నివసించే అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో వెలసిన వీర బ్రహ్మేంద్ర స్వాములకు ఎమ్మెల్యే కోట్ల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంరాష్ట స్థాయి బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, తిరుమలేష్ చౌదరి, హనుమంతరెడ్డి, చంద్రశేఖర్, మల్లికార్జున, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతలు కడప జిల్లా ఎద్దులు

సంజామల, నవంబర్ 26: నైనాలప్ప తిరుణాలలో భాగంగా నైనాలప్ప క్షేత్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో కడప జిల్లా ఎద్దులు విజేతలుగా నిలిచాయి. మంగళవారం నాలుగుపండ్ల విభాగానికి చెందిన ఎద్దుల పోటీలను ప్రారంభించారు. కడప జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన సాయి కుమార్ రెడ్డి ఎద్దులు అత్యధిక దూరం రాతిదూలం లాగి మొదటి విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో కడప జిల్లా వాసుదేవపురం గ్రామానికి చెందిన మోక్షజ్ఞ రెడ్డి ఎద్దులు తృతీయస్థానంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరుకు చెందిన నరసింహా రెడ్డి ఎద్దులు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ. 30, రూ. 25, రూ. 20 వేల ప్రోత్సాహక బహుమతులను ఆలయ కమిటీ వారు అందజేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ధ్యేయం

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ మినిష్టర్ నారా లోకేశ్‌తో మాట్లాడి పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఎనిమిది కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 168 మంది నిరుద్యోగులు హాజరవ్వగా 66 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన వారికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తన స్వగృహంలో నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వారు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనంత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ అనంత రామ సుబ్బారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు చారిత్రాత్మకం :

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేయడం చారిత్రాత్మకమని ఆళ్లగడ్డ న్యాయవాదులు అన్నారు. అసెంబ్లీ తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను న్యాయవాదులు శాలువా, పూలమాలలతో మంగళవారం సత్కరించారు.


ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే అఖిలప్రియతో యువతీ యువకులు

నాటుసారా స్థావరాలపై దాడులు

డోన్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం ఎర్రగుంట్ల, దేవరబండ, ప్యాపిలి మండలంలోని ఆలేబాదుతండా గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసి ఇద్దరుసారా విక్రేతలపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. నిందితుల నుంచి 10 లీటర్ల నాటుసారా, 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక భరోసాపై హర్షం

డోన్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ దారులకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై డోన్ పట్టణ టీడీపీ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఇంట్లో పెన్షన్‌దారుడు మృతి చెందితే.. మరుసటి నెల నుంచి భార్యకు వితంతు పెన్షన్ అందేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆనందకరమన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పంటలకు బీమా చేసుకోవాలి : ఏడీ


పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ సుధాకర్

అవుకు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ సుధాకర్ అన్నారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్‌తో కలసి మెట్టుపల్లె గ్రామంలో రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఏడీ సుధాకర్ మాట్లాడుతూ రైతులు పంటల బీమా చేసుకుంటే పంటలు దెబ్బ తిన్నపుడు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఈఓ నవీన్‌తేజ, ఎంపీఈవో రామక్రిష్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ప్రధానమంత్రి ఫసల్‌బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం కోవెలకుంట్ల పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెనర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు రబీలో సాగు చేసిన శనగ, జొన్న మినుము తదతర పంటలకు ఇన్సూరెన్స్ చేసి పంటల నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, చిన్నకొప్మెవర్ల మాజీ సర్పంచ్‌తో పాటు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బనగానపల్లె: రైతులు జొన్నపంటకు ఇన్సురెన్సు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మంగళవారం కోరారు. పాతపాడు, పసుపుల గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయ అధికారి సిబ్బంది పరిశీలించారు. మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి రైతులకు వివరించారు.

యురేనియం టెండర్లను వెంటనే రద్దు చేయాలి


పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ప్యాపిలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యురేనియం టెండర్లను వెంటనే రద్దు చేయాలని మంగళవారం మండలంలోని జక్కసానికుంట్ల సచివాలయం ఎదుట మామిళ్లపల్లి, జక్కసానికుంట్ల, రాంపురం గ్రామస్థులు ఆందోళన చేశారు. సర్పంచు జయమ్మ ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని, పంటలను నాశనం చేసే ఈ యురేనియం తవ్వకాను ఎటువంటి పరిస్థితుల్లో ఒప్పుకోమన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి లక్ష్మికాంతా రెడ్డికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామక్రిష్ణ, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం చేయడంలో చురుగ్గా పాల్గొన్న

సచివాలయ ఉద్యోగికి సంతాపం

డోన్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలంలో సచివాలయ ఉద్యోగి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి కొవ్వొతులతో నివాళులర్పించారు. ఆయన మృతి బాధాకరమని డోన్ పట్టణ సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాయిబాబా ఆలయానికి రూ.లక్ష విరాళం


ధర్మవరం సుబ్బారెడ్డికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న దాత కిషోర్

డోన్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయ నిర్మాణానికి వికారాబాదుకు చెందిన కిషోర్ అను వ్యాపారవేత్త రూ.లక్ష విరాళాలు అందజేశారు. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎండు తెగులుపై అప్రమత్తంగా ఉండండి

ఉయ్యాలవాడ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): శనగ పంటను ఆసిస్తున్న ఎండు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని బీటీఎం ఉమమహేశ్వరి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాయలూరు, రూపనగుడి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం శనగ పంటలో ఎండు తెగులు కల్పిస్తుందన్నారు. దీని నివారణకు రైతులు బైట్యాక్సు లేదా సీలోకాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను లీటరు నీటిలో రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని రైతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీపీఏ సుమలత, రైతులు సుధాకర్‌రెడ్డి, చంద్రహసరెడ్డి, వెంకటరామయ్య, శ్రీనివాసరెడ్డి, పెద్దమస్తాన్, దస్తగిరి, హరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేలబిలం ఆలయ హుండీ లెక్కింపు

కొలిమిగుండ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలబిలం ఆయల హుండీ లెక్కింపును ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కమీటీ సభ్యులు నాగమల్లేశ్వరరెడ్డి, గంగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రహాసన్‌రెడ్డి, కొండయ్యగౌడు ఆధ్వర్యంలో ఉండి లెక్కింపు నిర్వహించగా రూ.48వేలు ఆదాయం లభించినట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

పరిశ్రమల సందర్శన విద్యార్థులకు ఉపయోగకరం



మోడల్ స్కూల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ పరిశ్రమలు, సంస్థలను సందర్శించడం ద్వారా విద్యార్థులకు ఎన్నో రకాల ఉపయోగాలు కలుగుతాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, వోకేషనల్ ట్రైనర్స్ అప్సార్ భాషా, రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును మోడల్ స్కూల్ విద్యార్థులు సందర్శించగా, సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాముడు, రంగడు, రాధా తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే

చాగలమర్రి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 సచివాలయాల పరిధిలో క్యాన్సర్ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఇమ్రాన్, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆయా గ్రామాలకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి 18 సంవత్సరాలు నిండిన మహిళల వివరాలను సేకరించి క్యాన్సర్ వ్యాధిలో మూడు లక్షణాలపై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 10 వేల కుటుంబాలకు సర్వే చేయడం జరుగుతుందని అన్నారు. వైద్య సిబ్బందికి అవసరమైన సామాగ్రిని అందజేశామని అన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం


బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రమణ, సిబ్బంది



ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు


దొర్నిపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నివాళి అర్పిస్తున్న ఎంపీడీవో, అధికారులు

భారత రాజ్యాంగం నిర్మాణంలో ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని రచించి సమాజంలోని సామాజిక రుగ్మతలను తొలగించేందుకు అంబేడ్కర్ చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు.


చాగలమర్రి బాలుర పాఠశాలలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


చాగలమర్రి బాలికల పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయినిలు


కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో...


అవుకులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి


ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న న్యాయాధికారి మురళీకృష్ణ


బేతంచెర్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన దళిత సంఘం నాయకులు


డోన్‌లో వైసీపీ ఆధ్వర్యంలో...


ప్యాపిలిలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం


కోవెలకుంట్ల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతి అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి


బనగానపల్లె గ్రంథాలయంలో...


కొండుపల్లె గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఏపీడీ సాంబశివరావు